క్లుప్తంగా

సన్న బియ్యం పంపిణీ చేయాలి



తహసీల్దార్ విజయ్‌కుమార్

కొడంగల్: మండల పరిధిలోని రేషన్ డీలర్లు వినియోగదారులకు సన్న బియ్యం మాత్రమే పంపిణీ చేయాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉగాది నుంచి రేషన్‌కార్డు దారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తోందన్నారు. ఉగాది నుంచి సన్నబియ్యం మాత్రమే పంపిణీ చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ దొడ్డు బియ్యం పంపిణీ చేయొద్దన్నారు. సన్న బియ్యం రాలేదని సాకులు చెబుతూ దొడ్డు బియ్యం పంపిణీ చేస్తే రేషన్ డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. షాపుల లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రస్తుతం షాపుల్లో ఉన్న దొడ్డు బియ్యం నిల్వలు తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు అలాగే ఉంచాలన్నారు.

కరీంపూర్‌లో రంజాన్ కిట్ల పంపిణీ



కరీంపూర్‌లో రంజాన్ కిట్లు పంపిణీ చేస్తున్న అనిల్

బంట్వారం: కోట్‌పల్లి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుందరి అనిల్ కరీంపూర్‌లో శుక్రవారం రంజాన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వమత సూక్తుల సారాంశం ఒకటేనన్నారు. ప్రశాంతంగా పండుగను జరుపుకోవాలని ఆయన సూచించారు. అనంతరం ఆయన ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

కొవ్వొత్తులతో ఘన నివాళి

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి



తాండూరు టౌన్‌లో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న క్రైస్తవులు

తాండూరు టౌన్: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి పట్ల తాండూరు క్రైస్తవ సోదరులు శుక్రవారం పట్టణంలోని పలు వీధుల గుండా శాంతి ర్యాలీ నిర్వహించారు. ఇందిరాచౌక్‌లో ఆయన చిత్రపటం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దేవునికి సేవకుడిగా, సత్యం, ధర్మం కోసం సామాజిక సేవాతత్పరతను ప్రజల్లోకి తీసుకెళ్తున్న పాస్టర్ ప్రవీణ్ మృతిపై అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఆయన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు చెబుతున్నప్పటికీ ఏపీ ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టి నిజానిజాలు వెలికితీయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు అశోక్ కుమార్, జనార్దన్, దేవదాసు, అనిల్, రవి, క్రిస్టియన్ మైనార్టీ అసోసియేషన్ ప్రతినిధి గులాం ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ ప్రార్థనలు



ప్రార్థనల అనంతరం మసీదు నుంచి బయటకు వస్తున్న ముస్లింలు

తాండూరు: రంజాన్ ఉపవాస దీక్షలు ఆచరిస్తున్న ముస్లింలు శుక్రవారం మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రంజాన్ మాసంలో ఇదే చివరి శుక్రవారం కావడంతో ప్రార్థన మందిరాలు కిటకిటలాడాయి. శనివారం ఆమావాస్య ముగిసిన తర్వాత నెలవంక కనిపించిన మరుసటి రోజు రంజాన్ పండగ జరుపుకొంటారు.

కొనసాగుతున్న పది పరీక్షలు

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం రెండు కేద్రాల్లో 331 మంది విద్యార్థులకుగాను 327 మంది హాజరయ్యారని ఎంఈఓ వెంకట్‌స్వామి తెలిపారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

కొడంగల్ రూరల్: పట్టణంలోని నాలుగు పదోతరగతి పరీక్షా కేంద్రాలను శుక్రవారం తహసీల్దార్ విజయకుమార్, ఎంపీడీఓ ఉషశ్రీ, ఎంఈఓ రాంరెడ్డి పరిశీలించారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.

తీరనున్న వందల ఏళ్ల కల

- వేగంగా సాగుతున్న కుదురుమల్ల వంతెన పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



కుదురుమల్ల వాగుపై నిర్మిస్తున్న భారీ వంతెన

దుద్యాల్: మండల పరిధిలోని కుదురుమల్ల, దౌల్తాబాద్ మండలం ఇముడాపూర్ గ్రామాల మధ్య పెద్ద వాగుపై వంతెన నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. వర్షాకాలం వచ్చిందంటే చాలు వాగు ఉధృతంగా ప్రవహిస్తుంటుంది. దీంతో దాదాపుగా నాలుగు నెలల పాటు రాకపోకలు నిలిచిపోయేవి. దీంతో కుదురుమల్ల గ్రామస్తులు అటు నుంచి దౌల్తాబాద్ వెళ్లలేకపోయేవారు. సెప్టెంబర్ 14న సాక్షి పత్రికలో వాగుపై వంతెన లేక..వెళ్లేందుకు దారి లేక అనే కథనం ప్రచురించాం. అప్పట్లో ప్రభుత్వం స్పందించి దాదాపుగా రూ.2 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులకు అనుమతులు మంజూరు చేసింది. వర్షాకాలం ప్రారంభం కాక ముందే వంతెన పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో వేగంగా పనులు సాగుతున్నాయి. రెండు గ్రామాల మధ్య నిర్వహించనున్న అల్లరాయప్ప జాతర ఉత్సవాలు వర్షాకాలం చివరల్లో జరుపుకుంటారు. ఇది ఆయా గ్రామాల పరిధిలో అతి పెద్ద జాతరగా గుర్తింపు ఉంది. ఈ ఉత్సవాలను చూడాలంటే వాగు దాటాల్సిందే. ఆ సమయంలో వాగులో నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో కుదురుమల్ల గ్రామస్తులు జాతరకు దూరమయ్యేవారు. ఈ వంతెన నిర్మాణంతో ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉంటుందని భావిస్తున్నారు.

త్వరగా పూర్తి చేయాలి



వర్షాకాలం వచ్చిందంటే చాలు ఈ వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. కుదరుమల్ల గ్రామం నుంచి ఇముడాపురం మీదుగా దౌల్తాబాద్ వెళ్లాలంటే ఇదొక్కటే మార్గం. వాగులో నీరు దాదాపుగా నాలుగు నెలలు పక్కగా ఉంటుంది. దీంతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కునేవాళ్లు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో వంతెన నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేశారు. ఏళ్ల నాటి కల తీరనున్నందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను కోరుతున్నాం. – రమేశ్ గౌడ్, కుదురుమల్ల

ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా



కుల్కచర్ల: పాంబండ దేవస్థానంలో ట్యాంకర్ ద్వారా నీటిని అందజేస్తున్న నేతలు

కుల్కచర్ల: భక్తులకు ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేయడం అభినందనీయమని కుల్కచర్ల ఎస్‌ఐ అన్వేష్ రెడ్డి, పాంబండ ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామంలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర బ్రహ్మోత్సవాలలో భాగంగా భక్తుల సౌకర్యార్థం ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన పద్మవెంకటయ్య సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంకర్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాత మూడురోజులు మంచినీరు సరఫరా చేయించడం సంతోషకరమన్నారు. అనంతరం పద్మవెంకటయ్య మాట్లాడుతూ పద్మరామలింగేశ్వర స్వామికి సేవ చేయాలనే సంకల్పంతో తను ఉచితంగా భక్తులకు మంచినీటిని అందిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ బాల నర్సయ్య, స్థానిక నాయకులు నర్సింలు, పులింగ వెంకటేష్, ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

నీటి వృథా..అరికట్టేదెలా?



దుద్యాల్: కుదురుమల్లలో బోరు నుంచి వృథాగా పోతున్న నీరు

దుద్యాల్: అసలే వేసవి కాలం..రోజురోజుకు పెరుగుతున్న ఎండలకు చాలా గ్రామాల్లో బోర్లలో నీరు అడుగంటిపోతున్నాయి. తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వచ్చిన కొద్దిపాటి నీటిని వారు పొదుపుగా వాడుకుంటున్నారు. కానీ మండల పరిధిలోని కుదురుమల్ల గ్రామంలో మాత్రం ఇలా బోరు నుంచి నీరు వృథాగాపోతున్న పట్టించుకోనే వారు కరువయ్యారు.

మాజీ సర్పంచుల బిల్లులు చెల్లించండి



పోస్ట్‌కార్డు ద్వారా సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్న మాజీ సర్పంచులు

దోమ: చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సర్పంచుల సంఘం మాజీ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయా గ్రామాల మాజీ సర్పంచులతో కలిసి తమ బిల్లులు చెల్లించాలని సీఎంకు పోస్టుకార్డు ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శాసనసభ ఎన్నికలకు ముందు మాజీ సర్పంచులకు ఇచ్చిన హామీలను రేవంత్ రెడ్డి పరిష్కరించాలన్నారు. అధికారం వచ్చాక ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి మాజీ సర్పంచులకు ఇచ్చిన హామీలు పరిష్కరించకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఏర్పాటై పదిహేను నెలలు గడుస్తున్నా మాజీ సర్పంచుల బిల్లులు చెల్లించడానికి డబ్బులు లేవా? అని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా తమ బిల్లులను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తునా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న రాంచంద్రారెడ్డి



మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి

బంట్వారం: సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బంట్వారం సహకార సంఘం సర్వసభ్య సమావేశాన్ని కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అర్హులైన రైతులందరికీ స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు ఇస్తున్నామన్నారు. తీసుకున్న రుణాలను వాయిదాల ప్రకారం సక్రమంగా చెల్లిస్తే వడ్డీ తక్కువగా ఉంటుందన్నారు. రికవరీ 50శాతం కంటే ఎక్కువగా ఉంటేనే నాబార్డు లాంటి సంస్థలు తిరిగి అప్పు ఇచ్చేందుకు ఆసక్తి చూపిస్తాయన్నారు. సంఘం అభివృద్ధికి రైతులందరూ సహకరించాలని ఆయన తెలిపారు. రైతులకు ఎప్పటికప్పుడు ఎరువులు అందుబాటులో ఉంచి పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. సొసైటీలో తక్కువ వడ్డీకే బంగారం తాకట్టుపై రుణ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అంతకు ముందు సీఈఓ బ్రహ్మం జమా ఖర్చుల లెక్కలను సభలో చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ సుధాకర్‌గౌడ్, సొసైటీ డైరెక్టర్లు రాధాకృష్ణగౌడ్, మధుసూదన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ యాదగిరి, సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ధారూరు: తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలని ధారూరు పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి రైతులకు సూచించారు. ధారూరు సహకార సంఘం కార్యాలయ ఆవరణలో శుక్రవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీసుకున్ను రుణలను సత్వరమే చెల్లించాలన్నారు. జాప్యం చేస్తే వడ్డీ పెరుగుతుందన్నారు. ఎరువుల వ్యాపారం, వరి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ద్వారా సంఘానికి రూ.44లక్షల ఆదాయం సమకూరిందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సంఘం సీఈఓ నర్సింహులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాన్‌సింగ్, డైరెక్టర్లు తుల్యానాయక్, టీ. గోపాల్‌రెడ్డి, మల్లమ్మ, కె. గోపాల్‌రెడ్డి, అబ్దుల్‌కరీం, రవీందర్, ఎం.శివకుమార్, రైతులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

మర్పల్లి: క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని ఎంపీటీసీ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు సురేశ్ పేర్కొన్నారు. మర్పల్లి మండలంలో 12రోజుల పాటు నిర్వహించిన బిల్‌కల్ ప్రీమియం లీగ్ శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలకు శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. విన్నర్‌కు మొదటి బహుమతి కింద రూ.30వేలు, రన్నర్‌కు రూ.15వేలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల పట్ల ఆసక్తి చూపాలని యువతకు సూచించారు. గ్రామీణ ప్రాంతంలో క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడారంగ అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రమోద్, మనోహర్, ఆయా గ్రామాల క్రీడాకారులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యా బోధనకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ గ్యామా

దోమ: ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్య బోధించేందుకు కృషి చేయాలని ఎంపీడీఓ గ్యామా సూచించారు. శుక్రవారం దోమ మండల కేంద్రంలో ఎంఈఓ వెంకట్ ఉపాధ్యాయులకు నిర్వహించిన సమీక్ష సమావేశంలో పలు సూచనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులే ఎక్కువగా ఉంటారని, ఉపాధ్యాయులు ప్రత్యేకశ్రద్ధతో బోధన చేపట్టాలన్నారు. ప్రతీ పాఠశాలలో యూనిఫామ్స్, నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలు సరైన సమయంలో అందజేయాలన్నారు. అనంతరం ఎంఈఓ వెంకట్ మాట్లాడుతూ..ప్రతి పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ వందశాతం పూర్తి చేయాలన్నారు. ఎఫ్ఏ1, ఎఫ్ఏ2, ఎఫ్ఏ3, ఎఫ్ఏ4, ఎస్ఏ1ను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతీ విద్యార్థిది ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ క్రమం తప్పకుండా వేయాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం వడ్డించాలన్నారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లాల్యానాయక్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, మండల మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



దుద్యాల్: సంగాయిపల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ వెంకటర్ రెడ్డి

దుద్యాల్: గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని సంగాయపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద మంజూరైన రూ.5 లక్షల నిధులతో గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఆంజనేయులు, జలాలోద్దిన్, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

నాగసముందర్‌లో సీసీ రోడ్డు పనులు..

యాలాల: నాగసముందర్‌లో మంజూరైన రూ.10లక్షల ఈజీఎస్ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం మాజీ సర్పంచ్ భోజిరెడ్డి, బొంకూరు అంజిలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు చురుకుగా సాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మెట్టు వెంకటయ్య, లాల్‌రెడ్డి, యాదయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వీర్‌శెట్టిపల్లిలో సీసీరోడ్డు పనులు..



తాండూరు రూరల్: వీర్‌శెట్టిపల్లిలో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న శ్రీహరి తదితరులు



యాలాల: సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తాండూరు రూరల్: ఎంపీ నిధులతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బొప్పి శ్రీహరి పేర్కొన్నారు. శుక్రవారం వీర్‌శెట్టిపల్లి గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద మంజూరైన రూ.12 లక్షలతో సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ..చేవేళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సహకారంతో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే పల్లెల్లో అభివృద్ధి పనులు సాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగప్ప, శ్రీనివాస్, పరుశురాం, శంకర్, శ్రీనివాస్, శేఖర్, హరిశ్, నరసింహా, జర్నప్ప, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో సైబేజ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ..

పూడూరు: గ్రామ అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల చేయూత అభినందనీయమని మాజీ సర్పంచ్ సంధ్యా భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సోమన్‌గుర్తిలో సైబేజ్ సాఫ్ట్‌వేర్ సంస్థ పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. రూ.7లక్షలతో నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రూ.8లక్షలతో సీసీ రోడ్డు పనులను, రూ.4లక్షలతో నిర్మించిన ప్రభుత్వ పాఠశాలలో టాయిలెట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా కంపెనీ సీఎస్‌ఆర్ హెడ్ రీతునతని మాట్లాడుతూ గ్రామంలో కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సైబేజ్ ప్రతినిధులు ప్రశాంత్‌మహాముని, అనపురవు సురేశ్, సాగర్, విద్యాసాగర్‌రెడ్డి, సీతారాంరెడ్డి, మహేష్‌రెడ్డి, రఘురాంరెడ్డి, వెంకటేశ్, రవి, రజనీకాంత్, శివారెడ్డి, నారాయణరెడ్డి, జంగయ్య, అనంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



అగ్నిగుండానికి హాజరైన భక్తులు

కుల్కచర్ల: మండల పరిధిలోని బండవెల్కిచర్ల గ్రామ పరిధిలో వెలసిన శ్రీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రాత్రి అక్కడే నిద్రించి శనివారం ఉదయం 4 గంటల నుంచి స్వామి వారికి నిర్వహించనున్న అగ్నిగుండంలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకుంటారు. దీంతో ఆలయ పరిసర ప్రాంతాలు పూర్తిగా కిక్కిరిసిపోయింది. ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చైర్మన్, అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

భ్రమరాంబ మల్లికార్జున స్వామికి పూజలు



గూడూర్‌లో భ్రమరాంబ మల్లికార్జున స్వామికి గిరి ప్రదక్షిణ చేస్తున్న గ్రామస్తులు

దోమ: మండల పరిధిలోని గూడూర్ గ్రామంలో వెలసిన భ్రమరాంబ మల్లికార్జున స్వామికి శుక్రవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా స్వామి వారికి గిరి ప్రదక్షిణ చేపట్టిన అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలి

తాండూరు మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డి



ఆస్తిపన్ను వసూలు చేస్తున్న విక్రంసింహారెడ్డి

తాండూరు: ప్రతిఒక్కరూ పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలని తాండూరు మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తాండూరు మున్సిపల్ పరిధిలోని 21వ వార్డులో ఆస్తి పన్ను చెల్లిస్తే వడ్డీ రాయితీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకుడు ముక్తధార్‌పాష రూ.40వేలకు పైగా బకాయి ఉన్న ఆస్తి పన్నును మాజీ కౌన్సిలర్ జుబేర్‌లాలకు కట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందితో కలిసి వచ్చి 90 శాతం వడ్డీ మాఫీ చేసి అతని నుంచి రూ.25 వేలు వసూలు చేసుకున్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. ఆస్తిపన్నుపై వడ్డీ మాఫీ చేస్తామని ప్రకటించిన తర్వాత వార్డుల్లో పన్ను చెల్లించేందుకు ప్రజలు ముందుకు వస్తున్నారన్నారు. శుక్రవారం వరకూ రూ.15 లక్షల మొండి బకాయిలు వసూలయ్యాయని పేర్కొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు నిలుస్తాయని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పరిగి పట్టణంలోని శారద గార్డెన్‌లో ఆయన ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రంలో మత విద్వేషాలకు తావులేకుండా హిందూ, ముస్లింలు కలిసిమెలిసి ఉండాలన్నారు. అన్ని మతాల పండుగలను సంస్కృతి, సంప్రదాయాలతో జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతిఒక్కరూ రంజాన్ వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని చెప్పారు. మాజీ కోఆప్షన్ సభ్యుడు మీర్‌మహమూద్ అలీ, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కొప్పుల అనిల్‌రెడ్డి, మౌలాన, ఆర్ ఆంజనేయులు, సురేందర్, భాస్కర్, పాల్గొన్నారు.

దుద్యాల్: మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ అని యాదవ హక్కుల పోరాట సమితి వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు పుర్ర పెంటయ్య తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నయ్య, మున్నావర్, జహంగీర్, కరీం, యూసుఫ్, నరేశ్ గౌడ్, ముస్తాక్, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
వెంకటరమణ-9912220528
Md. జకీర్-9573005622